

ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి వీడ్కోలు

ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి పోలీసు యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. - 8లో



బ్యాంకుల తీరుపై ఆగ్రహం

బ్యాంకు యాజమాన్యాల తీరుపై ఆయా బ్యాంకుల్లో పనిచేస్తున్న మాజీ సైనికులు మండిపడ్డారు. - 8లో



చేయూతనిస్తూ..

చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారికి ప్రభుత్వం జగనన్న చేదోడు కింద ఏటా రూ.10వేలు అందిస్తోంది. - 8లో

సాక్షి తిరుపతి

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,158 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,801 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.51 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టోకెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనకు అన్నిశాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

శక్తిస్వరూపిణికి స్వర్ణాభరణాలు



ఆలయ కమిటీ చైర్మన్‌కు ఆభరణాలు అందిస్తున్న దాతలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి పట్టణానికి చెందిన ఎంజీ స్వరూప్ దంపతులు రూ.4 లక్షలు విలువైన 70 గ్రాముల బంగారు నుదుటి పట్టీ, ముక్కర, ముక్కుపుడకను వితరణగా అందించారు. ఆభరణాలను ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎస్పీగా మల్లికా కార్గ్ నేడు బాధ్యతల స్వీకరణ

తిరుపతి క్రైమ్ : జిల్లా నూతన ఎస్పీగా మల్లికా కార్గ్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రకాశం జిల్లా ఆమె తిరుపతికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డిని ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు.

ముక్కంటికి 108 కలశాల వితరణ



కలశాలు అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయానికి రైల్వేకోడూరుకు చెందిన ఆదర్శ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల అధినేత కంచిరాజు చెంగల్‌రాజు రూ.1.10లక్షల విలువైన 108 కలశాలను వితరణగా అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు అధికారులు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

వన్నెకుల క్షత్రియుల.. జైత్రయాత్ర

'నలభై ఏళ్ల నిర్లక్ష్యానికి గురిచేశారు. తన రాజకీయ స్వార్థం కోసం మమ్మల్ని కరివేపాకులా వాడుకుని వదిలేశారు. పదవులన్నీ తన సామాజిక వర్గానికే కట్టబెట్టి మాకు మొండి చెయ్యే చూపారు. కష్టాలు పడ్డాం.. నష్టాలు అనుభవించాం.. అవమానాలు ఎదుర్కొన్నాం..' అంటూ వన్నెకుల క్షత్రియులు చంద్రబాబునాయుడుపై విరుచుకుపడ్డారు. సీఎం జగనన్న పుణ్యమా అని ఇప్పుడు తమకు గుర్తింపు లభించిందని సగర్వంగా వెల్లడించారు. పదవులిచ్చి తన పక్కన కూర్చోబెట్టుకుని చరిత్ర సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో జగనన్న అండతో వన్నెకుల క్షత్రియుల జైత్రయాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నమ్మకానికి.. విశ్వాసానికి మారుపేరు పల్లెరెడ్లు

- నలభై ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సామాజిక వర్గం
- ఓట్లతో గద్దెనెక్కిన టీడీపీ వన్నెకుల క్షత్రియులకు గుర్తింపు ఇవ్వలేదు
- కుప్పంలో వన్నెకుల క్షత్రియులను పట్టించుకోని చంద్రబాబు
- శ్రీకాళహస్తిలో గర్జించిన వన్నెకుల క్షత్రియులు

సాక్షి, తిరుపతి/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వన్నెకుల క్షత్రియులు గర్జించారు. నలభై ఏళ్లుగా గుర్తింపు, గౌరవం లభించలేదని టీడీపీపై ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే పల్లెరెడ్లకు చట్టసభల్లో స్థానం లభించిందని ఆ సామాజిక వర్గం నేతలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో ఆదివారం వన్నెకుల క్షత్రియ జైత్రయాత్ర కార్యక్రమం నిర్వహించారు. వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్‌కుమార్, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వివిధ పదవుల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

పల్లె రెడ్లు నమ్మితే ప్రాణం ఇస్తారు

వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం వారు నమ్మితే ప్రాణం ఇస్తారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. నమ్మకానికి, విశ్వాసానికి మారు పేరు పల్లెరెడ్లు అన్నారు. వన్నెకుల సామాజికవర్గం వారికి 40 ఏళ్లుగా గుర్తింపు లేదని గుర్తుచేశారు. సామాన్య కుటుంబానికి చెందిన మోపిదేవి వెంకటరమణను గల్లీ నుంచి ఢిల్లీ వరకు పంపిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలిపారు. అదే చంద్రబాబు రాజ్యసభ సీట్లను తన సామాజికవర్గం వారైన సుజనాచౌదరి తదితరులకు కట్టబెట్టారని గుర్తుచేశారు. చంద్రబాబు రాజ్యసభ సీట్లను అమ్ముకున్నారని విమర్శించారు. కుప్పంలో సామాన్య కుటుంబానికి చెందిన యువకుడు భరత్‌ని ఎమ్మెల్సీని చేసి, ఏకంగా చంద్రబాబుపై పోటీకి దింపి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. ఈ రోజు తన పక్కన కూర్చున్న భరత్ రేపు అసెంబ్లీలో కూర్చోబోతున్నాడని జోస్యం చెప్పారు. డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సేవలను టీడీపీ వారు వాడుకున్నారే తప్ప ఏ రోజూ గుర్తించిన దాఖలాలు లేవన్నారు. అటువంటి వ్యక్తి గురించి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ 48 గంటల్లో ఎమ్మెల్సీని చేశారని వివరించారు. ఈ విషయాన్ని సిపాయికి చెబితే.. నమ్మలేదన్నారు. 'ఇది నిజమేనా' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. 40 ఏళ్లలో చనిపోయిన కుటుంబానికి ఎవరైనా ఆర్థిక సాయం చేశారా? ముస్లిం కుటుంబాల పిల్లలకు పెళ్లికానుక ఎవరైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. 40 ఏళ్లుగా ఎందుకు రోడ్లు వెయ్యలేదు అని టీడీపీ నేతలను ప్రశ్నించారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఎవరైనా ప్రాణాలు కోల్పోతే పూడ్చడానికి శ్మశానం కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నలభై ఏళ్ల పాలించిన వారు శ్మశానం ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. అభివృద్ధి అంటే రోడ్లే కాదు, సంక్షేమం కూడా అభివృద్ధేనని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తికి ఏడాదికి ఒకసారి ఖర్జూరం అమ్మేందుకు కొందరు వ్యాపారులు వస్తారని, వారు 15 రోజులు ఉండి వెళ్తారని.. బొజ్జల కుటుంబీకుల గురించి పరోక్షంగా ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో సొంత ఊర్లో వారినైనా పట్టించుకున్నావా? అని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పేవారిని నమ్మొద్దన్నారు. కౌరవులందరూ ఒకపక్క అయితే శ్రీకృష్ణుడు ఒక్కడే ఒకపక్క అని అలా టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం ఒక వైపైతే.. వైఎస్సార్‌సీపీ మాత్రమే ఒకవైపు అని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీనే మన భవిష్యత్తు

వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతోనే భవిష్యత్ అని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. పల్లెరెడ్లు ఒక మెట్టు ఎదిగారంటే సీఎం వైఎస్ జగన్ పుణ్యమేనని స్పష్టం చేశారు. నలభై ఏళ్ల తనను, తన సేవలను వాడుకున్న టీడీపీ ఏనాడూ పిలిచి గౌరవం ఇచ్చిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో మన సామాజిక వర్గం వారిని ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్న నాయకుడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన గురించి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ద్వారా తెలుసుకుని పిలిచి పదవిని ఇచ్చి గౌరవం తీసుకువచ్చారని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా ప్రకటించారని చెబితే నమ్మలేక పోయానని గుర్తుచేశారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. తనకు గాడ్ ఫాదర్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డే అని స్పష్టం చేశారు.

వన్నెకులాల వారికి సీఎం జగన్ వల్లే గుర్తింపు

కుప్పంలో వన్నెకుల క్షత్రియులను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని ఎమ్మెల్సీ భరత్‌కుమార్ వివరించారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి చంద్రమౌళిని గుర్తించి పిలిచి కుప్పం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. తండ్రి మరణించాక తనను పిలిచి పక్కన కూర్చోబెట్టుకుని మనోధైర్యాన్నిచ్చిన నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. అంతటితో ఆగకుండా కుప్పం అభ్యర్థిగా ప్రకటించి వన్నెకుల సామాజికవర్గం వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. ఏ కులమైనా ఎదగాలంటే అంతో ఇంతో రాజకీయ పదవులు ఉండాలని స్పష్టం చేశారు.



సంఘీభావం తెలుపుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం తదితరులు



సభకు హాజరైన నేతలు, వన్నెకుల క్షత్రియులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



సభకు తరలివస్తున్న వన్నెకుల క్షత్రియులు

శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : తలకోన సిద్దేశ్వరస్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదివారం విడుదల చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి మాట్లాడుతూ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాలకు పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులను దృష్టిలో ఉంచుకుని భారీగా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి

గూడూరురూరల్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని రామలింగాపురం, సంతదాసుపల్లె, పగడాలపల్లె, మిట్టాత్మకూరు, విందూరు గ్రామాల్లో ఆయన పర్యటించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రామలింగాపురంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మురళీధర్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుని సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అర్ధరాత్రి అయినా తన తలుపు తట్టవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వెల్లడించారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ సమన్వయకర్తగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారని చెప్పారు. పార్టీ తరఫున గెలిచి అమ్ముడుపోయిన వ్యక్తికి గత ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని, ఈ పర్యాయం కూడా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, చేవూరు విజయమోహన్‌రెడ్డి, ఎంపీపీ బూదూరు గురవయ్య, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, శ్రీకిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చంద్రమోహన్, కందలి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని సంతదాసుపల్లె, చెంబడిపాళెం గ్రామాలోని టీడీపీకి చెందిన 30 కుటుంబాలు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య పాల్గొన్నారు.

సమస్యలపై స్పందిస్తూ.. సత్వరం పరిష్కరిస్తూ!

- ఉద్యోగులను కార్యోన్ముఖులను చేస్తూ పాలన
- సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- ప్రజలతో మమేకమవుతున్న కలెక్టర్ లక్ష్మీశ



అర్జీదారుతో ఆప్యాయంగా మాట్లాడుతున్న కలెక్టర్



స్పందనలో అర్జీదారులసమస్యలను సావధానంగా వింటున్న కలెక్టర్ లక్ష్మీ శ (ఫైల్)

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియలో భాగంగా విజయవాడలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీ శ తిరుపతి జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి అనతికాలంలోనే జిల్లా పాలనలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి తనదైన ముద్ర వేస్తున్నారు. కలెక్టరేట్‌లోని పలు విభాగాలను స్వయంగా తనిఖీ చేసి ఉద్యోగులకు, అధికారులకు పాలనాపరమైన సలహాలు అందిస్తున్నారు. అన్నిశాఖల సిబ్బంది సమన్వయంగా పనిచేయాలని సూచిస్తున్నారు. ఈ మేరకు నూతన కలెక్టర్ ప్రజా సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తూన్నారంటూ ప్రజలు, ఉద్యోగులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

తనదైన 'స్పందన'

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పందన తొలి కార్యక్రమంలోనే ఆయన ప్రశంసలు అందుకున్నారు. ప్రజా సమస్యలపై ప్రతి సోమవారం చేపట్టే స్పందనలో సమూల మార్పులు తీసుకువచ్చారు. తమ గోడును అధికారులకు విన్నవించుకునేందుకు వచ్చే అర్జీదారులను కుర్చీల్లో కూర్చోబెట్టి ఆప్యాయంగా పలకరించి సమస్యను సావధానంగా వింటూ, పరిష్కారమార్గాలను చూపించేందుకు కృషి చేస్తున్నారు. తక్షణం సమస్యపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి అర్జీదారుల నుంచి అభినందనలు అందుకుంటున్నారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు చేపట్టడం విశేషం.

ఎన్నికలపై ప్రత్యేక ఫోకస్

రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తూ కార్యోన్ముఖులను చేస్తున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలంటూ సిబ్బందిలో ఉత్సాహం నింపుతున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించేలా చర్యలు చేపడుతున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపపై ప్రత్యేక దృష్టి సారించి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిబంధనల మేరకు అన్ని రాజకీయ పార్టీల నేతల నుంచి వినతులు స్వీకరిస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా

జిల్లాలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై కలెక్టర్ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. అర్హత కలిగిన ప్రతి వ్యక్తికీ సంక్షేమ ఫలాలు అందించాలని సూచిస్తున్నారు. అన్ని అర్హతలు ఉండీ పథకాలు రాని వారిని గుర్తించి ప్రత్యేకంగా వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నారు. అలాటే జిల్లాలోని మండల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే పాలనపై పట్టు సాధించి, గాడితప్పిన అధికారులకు వారి బాధ్యతలను గుర్తు చేస్తూ ముందుకు సాగుతున్నారు.

సత్తెమ్మకు పాల పొంగళ్లు

కలువాయి: మండలంలోని తోపుగుంటలో వెలసిన గ్రామదేవత సత్తెమ్మకు ఆదివారం గ్రామస్తులు పాల పొంగళ్లు పెట్టారు. ఏటా ఒక వారం తోపుగుంట వాసులు, మరోవారం అగ్రహారం వాసులు సత్తెమ్మకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. మొదటగా ఈ ఆదివారం తోపుగుంట వాసులు అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పాల పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సత్తెమ్మ ఆశీస్సులుంటే గ్రామం భోగభాగ్యాలతో అలరారుతుందని నమ్మకం. ఈ క్రమంలో గ్రామం నుంచి దూరప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారు కూడా ఇక్కడికి వచ్చి పాల పొంగళ్లు పెట్టుకుంటారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటారు.



పొంగళ్లు తీసుకువస్తున్న మహిళలు, (ఇన్‌సెట్) విశేషాలంకరణలో సత్తెమ్మ

క్లుప్తంగా

తిరుమలలో ఏనుగుల గుంపు హల్‌చల్


ఏనుగులు విరిచేసిన ఫెన్సింగ్

తిరుమల: తిరుమలలోని పార్వేటి మండపం వద్ద ఏనుగుల గుంపు హాల్ చల్ చేసింది. పాపనాశం వెళ్లే మార్గంలోని పార్వేటి మండపానికి సమీపంలో ఏనుగుల గుంపు స్వైర విహారం చేసింది. శేషాచలం అటవీ ప్రాంతంలో టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీ గంధం వనం వద్దకు ఏనుగుల గుంపు వచ్చింది. శ్రీగంధం వనం వద్ద ఏర్పాటు చేసిన భారీ కంచెలను ధ్వంసం చేశాయి. ఆదివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఏనుగుల గుంపు వచ్చిందన్న సమాచారంతో టీటీడీ అటవీశాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏనుగుల గుంపుని అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ప్రయత్నించి సఫలమయ్యారు. వేసవి ప్రారంభం కాకముందే నీటి కోసం వెతుకుతూ ఏనుగుల గుంపు శేషాచలం అటవీ ప్రాంతాన్ని వదిలి బయటకు వచ్చినట్లు టీటీడీ అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

తిరుమల : తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. వివరాలు.. తిరుమల శ్రీవారి ఆలయంలోని సబేరాలో కె.యతిరాజ నరసింహన్(43) అనే వ్యక్తి పరిచారికగా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఘాట్‌రోడ్డులో కిందకు దిగుతుండగా 37వ మలుపు వద్ద మంగళం డిపోకు చెందిన బస్సు వెనకనుంచి ఢీకొనడగా నరసింహన్ అక్కడికక్కడే మరణించాడు. ట్రాఫిక్ పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇది కదా.. అభివృద్ధి

చేయూతనిస్తూ.. చేదోడుగా ఉంటూ!


టైలరింగ్ చేస్తున్న దృశ్యం

కుల వృత్తిపైనే ఆధారపడిన వారు కొందరు.. చేతి పనితో సంతృప్తిపడుతున్న వారు మరికొందరు.. వీరి కష్టాలు..నష్టాలు.. గురించి గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. వారికి అండగా ఉండాలన్న ఆలోచన ఏ ఒక్కరికీ రాలేదు. నాడు ప్రతిపక్ష హోదాలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాద యాత్రలో కులవృత్తులనే నమ్ముకుని బతుకు బండి లాగుతున్న చాలా మంది కష్టాలు తెలుసుకున్నారు. వారి సమస్యలను విన్నారు. నేనున్నానని భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగనన్న చేదోడు పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి ఏడాదికి రూ.10 వేలు చొప్పున మంజూరు చేసి ఆదుకున్నారు. ఒక్క వెంకటగిరి నియోజకవర్గంలోనే ఈ నాలుగున్నరేళ్లలో 1,555 మంది కులవృత్తిదారులకు జగనన్న చేదోడు పథకం కింద రూ.6.22 కోట్లు మంజూరు చేశారు. దీనిపై లబ్ధిదారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగనన్నా.. పదివేల వందనాలన్నా అంటూ నీరాజనాలు సమర్పిస్తున్నారు.

- కులవృత్తులకు భానటగా రాష్ట్ర ప్రభుత్వం
- ఏటా ఒక్కో లబ్ధిదారునికి ఏటా రూ.10వేలు
- వెంకటగిరి నియోజకవర్గంలో నాలుగు విడతలో రూ.6.22 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న చేతివృత్తిదారులు

సైదాపురం: కులవృత్తులే జీవనాధారంగా బతుకుతున్న రజకులు, నాయీబ్రహ్మణులతో పాటు టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారు. ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. 2020 జూన్ 10న తొలవిడతగా జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభించారు. షాపులు ఉన్న రజకులు, నాయీబ్రహ్మణులు, టైలర్ల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయాన్ని జమ చేస్తున్నారు. 21 నుంచి 60 ఏళ్లలోపు వయసు ఉన్న వృత్తిదారులు ఈ పథకానికి అర్హులు.

నాడు: గతంలో చేతివృత్తుదారుల శ్రమను ఏ ఒక్కరూ గుర్తించలేదు. కాలానుగునంగా ఎదురయ్యే కష్టాలతో కనుమరుగవుతున్న కులవృత్తులను ఆదుకునే నాథుడే కరువయ్యారు. టీడీపీ హయంలో నాసిరకానికి చెందిన అరకొర ఇస్త్రీ పెట్టెలు, కత్తెర్లు తదితర వాటిని ఏకొద్ది మందికో ఇచ్చి చేతులు దులుపుకునేవారు. వాటి కొనుగోలులోనూ టీడీపీ నాయకులు కమీషన్ల కోసం కక్కుర్తిపడేవారు. ఇక జన్మభూమి కమిటీలు నిర్ణయించిన వారికే పరికరాలు ఇచ్చేవారు.

నేడు: అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. షాపులు కలిగిన టైలర్లు, రజకులు, నాయీబ్రహ్మణులకు ఏడాదికి రూ.10 వేల చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జమచేస్తోంది. ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా అండగా నిలుస్తోంది. జగనన్న చేదోడు నిధులతో రజకులు వారి కులవృత్తికి అవసరమైన డ్రమ్ములు, ఇస్త్రీ పెట్టెలు, బొగ్గులు కొనుగోలు చేసుకుంటున్నారు. టైలర్లు, నాయీబ్రహ్మణులు వారికి అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసి షాపులను అభివృద్ధి చేసుకుంటున్నారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

మండలం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మంజూరైన నిధులు
వెంకటగిరి పట్టణం	561	2కోట్లు 24లక్షల 40వేలు
వెంకటగిరి రూరల్	101	40లక్షల 40వేలు
సైదాపురం	268	కోటి 7లక్షల 20 వేలు
రాపూరు	192	76 లక్షల 80వేలు
కలువాయి	200	80 లక్షలు
బాలాయపల్లి	133	53లక్షల 20వేలు
డక్కిలి	103	41లక్షల 20వేలు


షేవింగ్ చేస్తున్న దృశ్యం

జగనన్న మేలు మరువలేం



ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏటా రూ.10 వేలు మా బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయి. జగనన్నను మేలు మరువలేం.
– బి.కల్యాణి , డక్కిలి

రూ.40 వేలు అందింది



సీఎం జగనన్న చేదోడు పథకం పెట్టి మాలాంటి చేతి వృత్తిదారులకు నాలుగు విడతలుగా రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇది ఎంతో భరోసానిచ్చింది. ఇలా సహాయం పొందిన మా నాయీబ్రాహ్మణ సోదరులు జగనన్న చేసినన మేలును మరువలేరు. –గుండ్లూరు నాగరాజు, నాయీబ్రాహ్మణ, తోపుగుంట

పారదర్శకంగా ఎంపిక



జగనన్న చేదోడు పథకానికి సంబంధించిన అబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. వృత్తిదారులు ఈ పథకం ద్వారా వచ్చే ఆర్థిక సాయంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని, ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. – జీ.సుధాకర్, ఎంపీడీఓ, సైదాపురం

మెటీరియల్‌కు ఉపయోగం



కులవృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న నాయీబ్రహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది. జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్న రూ.10 వేలతో షేవింగ్ సెలూన్‌కు అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేస్తున్నా. గతంలో ఏ ప్రభుత్వం కూడా నాయీబ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకోలేదు. –జీ.రవి, ఊటుకూరు, సైదాపురం మండలం

మెరుగైన జీవనం



సీఎం జగనన్న చేదోడు పథకం ద్వారా టైలరింగ్‌కు అవసరమైన లైనింగ్, ఫాల్స్ తదితర మెటీరియల్ తెచ్చుకుంటున్నా. సొంతంగా మెటీరియల్ సమకూర్చుకోవడంతో కొంత డబ్బు ఆదా అవుతోంది. ఇప్పటివరకు నాలుగు విడతల్లో రూ.40 వేలు మంజూరైంది. జగనన్నకి జీవితాంతం రుణపడి ఉంటా.
– పఠాన్ రహంతుల్లా, టైలర్, సైదాపురం

అప్పులు తొలగాయి



జగనన్న ఏడాదికి రూ.10వేలు ఇస్తున్నారు. దీంతో మాలాంటి పేదోళ్లకు చాలా మేలు జరుగుతోంది. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో కొత్త ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుగోలు చేస్తున్నా. ఈ సామగ్రి కొనుక్కునేందుకు దాదాపు రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చువుతోంది. రజకులను ఆదుకుంటున్న జగనన్నకు రుణపడి ఉంటాం.
– పీ.గంగయ్య, రజకుడు, వెంకటగిరి

చాలా ఉపయోగం



సీఎం జగనన్న ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు క్రమంతప్పకుండా ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఈసాయం పేద, మధ్య తరగతి వృత్తిదారులకు ఎంతో ఉపయోగం. షాపులు అద్దెకు లేదా సామగ్రి ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాం.
– సుజాత, టైలర్, వెంకటగిరి

'సిల్వర్ జూబ్లీ' రైతు బజార్


రైతు బజార్ వద్ద రైతులు, వ్యాపారులు

గూడూరురూరల్ : పట్టణంలోని రైతు బజార్ ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. రైతు బజార్ అసోసియేషన్ అధ్యక్షుడు జోగి శివకుమార్ మాట్లాడుతూ 1999 ఫిబ్రవరి 11వ తేదీన బజార్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయితే ఇటీవలి వరకు పట్టల కిందే వ్యాపారం చేసుకున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.1.15 కోట్లతో దుకాణాలు నిర్మించుకున్నట్లు వివరించారు. కార్యదర్శి మనపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు సుధాకర్, మణి, రాజగోపాల్, బీవీ రమణయ్య, సుందరయ్య, స్వరాజ్ బాబు పాల్గొన్నారు.

ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు


పరమేశ్వర్‌రెడ్డి దంపతులకు సత్కారం

తిరుపతి క్రైమ్ : ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డికి ఆదివారం జిల్లా పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీని సత్కరించింది. ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరించిందన్నారు. తిరుమల శ్రీవారి సమక్షంలో పనిచేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, శివరామ్‌రెడ్డి, రాజేంద్ర మాట్లాడుతూ.. మంచి నాయకత్వ లక్షణాలున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి కింద పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాలో పోలీస్ యంత్రాంగాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చారని వెల్లడించారు. పోలీస్ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, అనేక సంస్కరణలు అమలు చేశారని వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవరాజ్ మనీష్ పాటిల్ పాల్గొన్నారు.

బహుజన సాహిత్య అకాడమీ సమావేశం



అవార్డు స్వీకరణ

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఓ ఆడిటోరియంలో ఆదివారం బహుజన సాహిత్య అకాడమీ ఏడో జాతీయస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ గిరిజన సమస్య రాష్ట్ర అధ్యక్షుడు కె.రాఘవ నాయక్, సంతు సేవాలాల్ మహారాజ్‌కు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, రచయిత్రి వెంకమ్మ, సినీ గాయకుడు మిట్టపల్లి సురేందర్, పెండ్యాల అనంతయ్య, ఆర్జే నాయక్, ఎంఈఓ గోపాల్, కళాకారుడు టేకు పెంటయ్య పాల్గొన్నారు.



● **తీరంలో సందడి**

వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కేరింతలు కొడుతూ ఉత్సాహంగా సముద్రస్నానం చేశారు. సరుగుడు చెట్ల నీడలో వనభోజనాలు చేసి సేదతీరారు. మాఘ మాసం చంద్రోయ వేళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్శకులు భద్రత నిమిత్తం దుగరాజపట్నం మెరైన్ పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. – వాకాడు



బ్యాంకుల తీరుపై మాజీ సైనికుల ఆగ్రహం

తిరుపతి సిటీ : బ్యాంకుల్లో పనిచేస్తున్న మాజీ సైనికులపై ఆయా బ్యాంకుల యాజమాన్యాలు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నాయని అఖిల భారత మాజీ సైనిక బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి శిల్పారామంలో సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పలు బ్యాంకులలో పనిచేస్తున్న మాజీ సైనికుల పట్ల వ్యవహరించే తీరును బ్యాంకు యాజమన్యాలు మార్చుకోవాలన్నారు. మాజీ సైనికులకు అందవలసిన వెల్ఫేర్ యాక్టివిటీస్ అందరికీ సమానంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషోర్ కుమార్, కార్యదర్శి కాంతారావ్, పీఆర్ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విధి వంచితులు!


తొన్నాటి సుబ్బయ్య (ఫైల్)


ధనపాల్ (ఫైల్)


వినయ్ (ఫైల్)

విధి ఆడిన వింతనాటకంలో ఆ కుటుంబం చిన్నాభిన్నమైంది. కట్టుకున్న వాళ్లను.. కడుపులో పుట్టిన బిడ్డలను బలితీసుకుంది. సమాజం అంటే తెలియని భర్తచాటు ఆడపడుచులను వీధిన పడేసింది. పట్టెదన్నం పెట్టే కుటుంబ పెద్దలను దూరం చేసింది. నాలుగేళ్లగా వరుసగా ముగ్గురిని బలితీసుకుంది. కన్న పేగుకు కడివెడు దుఃఖాన్ని మిగిల్చింది. తాజాగా కుటుంబానికి ఉన్న ఒక్కగానొక్క వారసుడినీ దూరం చేసింది. ఈ హృదయ విదారక ఘటన శ్రీకాళహస్తి మండలం, తొండమనాడు దళితవాడలో చోటుచేసుకుంది.

వెంటాడుతున్న మృత్యువు

- నాలుగేళ్లలో తండ్రి, కొడుకు మృతి
- తాజాగా ఉరేసుకుని తనువు చాలించిన మనవడు
- తల్లడిల్లుతున్న కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: మండలంలోని తొండమనాడు దళితవాడలో ఎవరిని కదిలించినా కన్నీళ్లే సమాధానం చెబుతున్నాయి. పొదరిల్లు అల్లుకున్న ఓ కుటుంబ సభ్యుల బంధాన్ని విధి ఒక్కొక్కటిగా తుంచేస్తున్న వైనాన్ని తలచుకుని గుండెలు బాదుకునే వారే కనిపిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న అత్తను ఓదార్చలేక.. కడుపున పుట్టిన ఒక్కగానొక్క కొడుకు దూరమైనాడన్న బాధను భరించలేక ఆ ఇల్లాలు పడుతున్న నరకయాతనను తలచుకుని తల్లడిల్లిపోతున్నారు.

నాలుగేళ్లలో ఇద్దరు కుటుంబ పెద్దలు దూరం

తొండమనాడు దళితవాడకు చెందిన తొన్నాటి సుబ్బయ్య, లక్ష్మమ్మ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు ధనపాల్. ఆస్తిపాస్తులు లేకపోయినా రెక్కలు ముక్కలు చేసుకుని డిగ్రీ వరకు చదివించారు. ఉద్యోగ వేటలో చతికిలపడిన ధనపాల్‌కు తల్లిదండ్రులు బుచ్చినాయుడుకండ్రిగ మండలం, పుత్తేరి గ్రామానికి చెందిన జయంతితో వివాహం జరిపించారు. వీరికి వినయ్, దీప్తి ఇద్దరు పిల్లలు. తన బంధువుల సహకారంతో ధనపాల్ శ్రీకాళహస్తి పట్టణంలోని కోవనూరు స్టేట్ బ్యాంక్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగంలో చేరాడు. వచ్చే అరకొర సంపాదనకు తోడు తండ్రి సుబ్బయ్య కూలి పనులకెళ్లి కుటుంబాన్ని వెళ్లదీసేవాడు. ఇలా సాగిపోతున్న ఆ కుటుంబానికి నాలుగేళ్ల క్రితం అనుకోని షాక్ తగిలింది. కుటుంబ పెద్ద తొన్నాటి సుబ్బయ్య ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం ధనపాల్‌పై పడింది. కూలి పనులకెళ్లి భార్య జయంతి భర్తకు తోడుగా నిలిచేది. వచ్చే సంపాదనతోనే బిడ్డలను ఉన్నతంగా చదివించాలని పరితపించేవాళ్లు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం బ్యాంక్‌లో ఉద్యోగం ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న ధనపాల్‌ను లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. శ్రీకాళహస్తి పట్టణం, హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద జరిగిన ప్రమాదంలో ధనపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు.

వినయ్..దుఃఖాన్ని మిగిల్చావోయ్!

మామ, భర్త దూరమవడం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న అత్తను చూసుకోవడం జయంతికి కష్టతరమైంది. పుట్టింటి సహకారంతో బిడ్డలను ఉన్నతంగా చదివించాలని భావించింది. దీప్తి ఇంటర్ పూర్తిచేసి విజయవాడలో నీట్ కోచింగ్ తీసుకుంటోంది. వినయ్ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న నారాయణ కళాశాలలో ఐఐటీ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో గత గురువారం ఇంటి నుంచి వెళ్లిన వినయ్ (17) ఐఐటీలో సీటు రాదేమో అని బెంగ పెట్టుకున్నాడు. శనివారం మధ్యాహ్న సమయంలో హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని తనువు చాలించాడు. కుటుంబ సభ్యులు, బంధువులకు కన్నీళ్లు మిగిల్చాడు.

క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సినీనటి అనసూయ భరద్వాజ్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, సినీనటి అనసూయ భరద్వాజ్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రామయ్యగారి సుభాష్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.



శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

దుబాయ్‌లో శరత్‌చంద్రకు ప్రశంసలు

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన నృత్య కళాకారుడు డాక్టర్ శరత్‌చంద్ర దుబాయ్‌లో ప్రదర్శించిన భరతనాట్యంకు ప్రశంసలు లభించాయి. గ్లోబల్ విలేజ్ ఇండియా పెవిలియన్ వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో శరత్ చంద్ర అద్భుతరీతిలో ఇచ్చిన భరతనాట్య ప్రదర్శనకు విశేష ఆదరణ లభించింది. ఈ సందర్భంగా గ్లోబల్ విలేజ్ సంస్థ వారు శరత్ చంద్రను ఘనంగా సత్కరించి అభినందించారు.

ముగిసిన ఆర్ట్ ఎగ్జిబిషన్

తిరుపతి కల్చరల్: తిరుపతి ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రెండు రోజుల నేషనల్ క్యాంప్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ రెండు రోజులు ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 50 మంది చిత్రకారులు పాల్గొని ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ అనే అంశంపై తమ చిత్రాలను లైవ్ పెయింటింగ్స్ చేసి చూపరులను ఆకట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ముగింపు సమావేశానికి ఎస్వీయూ మాజీ వీసీ ప్రొఫెసర్ మురళి, డాక్టర్ సుకుమార్ హాజరయ్యారు తిరుపతి ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.హేమాక్షి ఆచారి, ప్రముఖ చిత్రకారుడు సింగంపల్లి సత్యనారాయణ, రావూరి సుభాష్‌బాబు, సి.నారప్ప, అంబాజీ, సీనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

పీపుల్ హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకం

తిరుపతి కల్చరల్: పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన పి.వెంకట్ కల్యాణ్‌ను నియమిస్తూ ఆ కమిటీ జాతీయ అధ్యక్షుడు బి.వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కమిటీ నిబంధనలకు అనుగుణంగా నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

తుమ్మచేనుపల్లెలో జల్లికట్టు



భారీ జనసందోహం నడుమ పరుగులు తీస్తున్న కోడెగిత్తలు





చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి పూలతో స్వాగతం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే, తుడా చైర్మన్‌ల ఫొటోలతో పలకలు కట్టిన ఎద్దుతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- జల్లికట్టును తిలకించిన చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి
- ఎమ్మెల్యే, తుడా చైర్మన్ ఫొటోలతో కూడిన పలకలు
- జల్లికట్టుకు భారీగా తరలివచ్చిన జనం

భాకరాపేట: సంక్రాంతి పండుగ తరువాత చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లెలో జల్లికట్టు సంబరాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం నిర్వహించిన జల్లికట్టు సంబరాలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రజలు, పరుగు పందాలను తిలకించడానికి వచ్చిన యువత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిపై పెద్ద ఎత్తున పూలు జల్లుతూ స్వాగతం పలికారు. ఎద్దులు వదిలే ముందు వాటి కొమ్ములకు బహుమతులు కట్టి, అవి వేగంగా పరుగు పందెంలో దూసుకెళ్లే విధంగా సిద్ధం చేశారు. వాటికి విభూది పౌడర్ రాసి పరుగు పందెంలో వదిలారు. కొమ్ములకు కట్టిన బహుమతులను లాక్కోవడం కోసం ప్రాంగణంలో యువత పోటీ పడ్డారు. పందెంలో దూసుకెళ్తున్న కోడెగిత్తలను చూసి జనం కేరింతలు కొట్టారు. పశువులు పోటీలను తిలకించడానికి చిన్న పెద్ద తేడా లేకుండా ఎత్తున చెట్లు, భవనాలపై నుండి తిలకించారు. ఈ ఏడాది ఎద్దులను పట్టడడం కష్టంగా మారింది. జనాలను చూసి పరుగులు తీయడం, జోరుగా వెళ్తుండడం, కొన్ని ఎద్దులు తప్పుకొని చిక్కకుండా అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతిలో సాహస క్రీడగా జల్లికట్టు జరుపుతారన్నారు. రైతు తన సంస్కృతిలో పశువులను భాగం చేసుకోవడం, తన వ్యవసాయ కాడిని మోస్తున్న పశువును అలంకరించి వాటిని ఉత్సాహ పరచడం మన సాంప్రదాయమన్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో రైతు పాత్ర చాలా ఉందన్నారు. ఈ సమాజం, వ్యవస్థ అన్ని బాగుండాలంటే రైతు సంతోషంగా ఉండాలన్నారు. రైతులకు నిరంతరం చెవిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందన్నారు. జల్లికట్టులో పాల్గొన్న రైతులకు, యువతకు, గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, గ్రామ పెద్దలు భానుప్రకాష్‌రెడ్డి, శుభాస్కర్‌రెడ్డి, దేవప్రసాద్, విజయ్‌కుమార్, నాగచెంగమునాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అడుగడుగునా అపూర్వ స్వాగతం



చిగురువాడలో గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

- చిగురువాడలో చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర

తిరుపతి రూరల్: మంగళ వాయిద్యాలు..అడుగడుగునా పూలవర్షంతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి ఆదివారం తిరుపతి రూరల్ మండలం చిగురువాడలో గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. గడప గడపలో మహిళలు కర్పూర హారతులు పడుతూ స్వాగతం పలికారు. ప్రతి గడపకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని, వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామంలో ప్రతి వీధికి సీసీరోడ్లు వేయడంతోపాటు, అవసరమైనచోట మురుగు కాలువలను నిర్మించిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డికే దక్కుతుందన్నారు. ఇరుకు భవనాల్లో మగ్గుతున్న ఉద్యోగుల కోసం కోట్లాది నిధులతో అత్యాధునిక ప్రభుత్వ భవనాలను నిర్మించి, ప్రజా పాలన అందించిన పాలనాదక్షుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. సీఎం జగనన్న, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి, సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ముచ్చెలి ప్రదీప్ కుమార్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాగణపతి ఆలయ కుంభాభిషేకం



శ్రీబాలమురి మహాగణపతికి పూజలు

చంద్రగిరి: మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీ శ్రీలక్ష్మీ నగర్(ఎస్ఎల్ నగర్)లో నూతనంగా నిర్మించిన శ్రీబాలమురి మహాగణపతి ఆలయ కుంభాభిషేక వేడుకలను ఆదివారం శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం గణపతి పూజ, కలశస్థాపన, కళా హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం అత్యంత వేడుకగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి, ప్రకాష్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వెంకటరెడ్డి, శ్రీలత దంపతులు, పురోహితులు డాక్టర్ శివకుమార్ శర్మ, ఎస్ఎల్ నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న వీసీ, అధికారులు

- రూ.16 కోట్లతో విద్యార్థినులకు హాస్టల్ భవనం
- రూ.10 లక్షలతో సెమినార్ హాల్ ఆధునికీకరణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ విద్యార్థినుల కోసం హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాలలో ఆధునిక వసతులతో నిర్మించిన సెమినార్ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కాలేజ్ విద్యార్థినుల హాస్టల్ భవన నిర్మాణానికి అదే కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు రూ.16 కోట్ల ఆర్థిక సాయం అందించడం గర్వకారణమన్నారు. ఈ నిధులతో నిర్మించే హాస్టల్ భవనంలో సుమారు 500మంది విద్యార్థినులకు వసతి సౌకర్యం లభించనుందని తెలిపారు. దీంతో పాటు ఎస్వీయూ పూర్వ ఆచార్యులు రఘునాథరెడ్డి అందించిన రూ.10లక్షల ఆర్థిక సాయంతో సెమినార్ హాల్‌ను నవీనీకరణ చేశామన్నారు. దాదాపు 200 మంది విద్యార్థులు కూర్చుని సదస్సు నిర్వహించేందుకు ఆధునికీకరించిన సెమినార్ హాల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసీ రాజారెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, దామోదర్‌రావు, గంగిరెడ్డి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ దామోదర్‌రెడ్డి, కేఎం భాను పాల్గొన్నారు.

మరపురాని మనిషి ఘంటసాల





ఘంటసాల గాన కళాపీఠం నాయకుల నివాళి, సోము ఉమాపతిని సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సుమధురమైన కంఠంతో అద్భుతమైన పాటలను గానం చేసి ప్రజల హృదయాలలో మరపురాని మనిషిగా చిరస్థాయిగా నిలిచిన అమర గాయకుడు ఘంటసాల అని గాన కళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయకుమార్‌రెడ్డి, శ్రీకాళహస్తి బోర్డు సభ్యుడు మహీధర్‌రెడ్డి తెలిపారు. గాన గంధర్వుడు ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని ఘంటసాల గాన కళాపీఠం ఆధ్వర్యంలో వీవీ మహల్ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మునిరెడ్డి, పురుషోత్తం, సోమశేఖర్‌రెడ్డి, లవకుమార్, నవీన్‌కుమార్‌రెడ్డి,రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘంటసాల పాటకు మరణం లేదు

ఘంటసాల మరణించినా ఆయన పాటకు మాత్రం మరణం లేదని పలువురు కొనియాడారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా రాయలసీమ రంగస్థలి కళాకారులు ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఘంటసాల శిష్యుడు, ప్రజా గాయకుడు డాక్టర్ సోము ఉమాపతిని ఘనంగా సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, సీఆర్‌కే శేషగిరిరావు, కళాకారులు కస్తూపద్మనాభన తిరుమలయ్య, మణిసుబ్రమణ్యం, సురేష్‌స్వామి, తిరుపాలాచారి, చెంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

తిరుపతి కల్చరల్: ఆశా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎల్.సుధీర్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశావర్కర్ల ప్రథమ రాష్ట్ర మహాసభలు ఆదివారం ఏఐయూటీయూసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆశా వర్కర్లు ఐక్యమై మహాసభ నిర్వహించినందుకు అభినందలు తెలియజేశారు. ఎస్‌డబ్ల్యూ ఎఫ్ఐ జాతీయ అధ్యక్షురాలు టీసీ.రమ మాట్లాడుతూ ఆశా వర్కర్ల నూతన రాష్ట్ర కమిటీని ఎంపిక చేశామని తెలిపారు. ఏఐయూటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా కె.కుమార్‌రెడ్డి, అధ్యక్షురాలిగా ఎస్.జహీరా, ఉపాధ్యక్షులుగా కె.పవనమ్మ, జి.కవిత, కార్యదర్శిగా సీహెచ్.ప్రమీల, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.మునేంద్ర, కోశాధికారిగా ఎ.హరీష్‌తో పాటు ఐదుగురు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

నాడు-నేడుతో బంగారు బాటలు



దామలచెరువు ఎంపీపీ పాఠశాల



దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్





తురకపల్లి ఎంపీపీ పాఠశాలలో నాడు-నేడులో ఏర్పాటు చేసిన డెస్కుల్లో కూర్చున్న విద్యార్థులు, అచ్చమ్మఅగ్రహారం ఎంపీపీ పాఠశాల

- కార్పొరేట్ పాఠశాలలకన్నా మెరుగైన వసతులు
- నాణ్యమైన జగనన్న గోరుముద్ద
- నాడు-నేడుతో కళాశాలలకు మహర్దశ

పాకాల: రాష్ట్ర వ్యాప్తంగా నాడు-నేడుతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదులు పడ్డాయి. కూలీనాలీ చేసుకుంటున్న వారైనా తమ పిల్లల భవిష్యత్తుకు మంచి చదువును అందించాలని కోరుకుంటారు. రెక్కలు ముక్కలు చేసుకునైనా తమ పిల్లలను ఇంగ్లీష మీడియంలో అన్ని వసతులు ఉన్న పాఠశాలల్లో చదివించాలని కోరుకుంటారు. అప్పుల పాలైనా తమ బిడ్డలను ఉన్నత స్థాయికి తీసుకుని రావాలని ఆకాంక్షిస్తారు. ఆ బాధ్యతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుని ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పేరుతో కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా అన్ని వసతులను ఏర్పాటు చేసి విద్యార్థులకు సకల సదుపాయాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను అందిస్తూ ఏమాత్రం తగ్గకుండా ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యను అందిస్తున్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా మొదటి విడతలో పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి 20 పాఠశాలలకు రూ.2,74,49,544 నిధులను విడుదల చేశారు. అలాగే నాడు-నేడు రెండో దశలో ప్రభుత్వ బాలుర, బాలిక జూనియర్ కళాశాలల్లో, 25 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు రూ.249.02 లక్షల నిధులను కేటాయించారు.

పాఠశాలలకు కొత్తరూపు

మండలంలో మొత్తం ప్రాథమిక పాఠశాలలు 58(విద్యార్థుల సంఖ్య-1529), ప్రాథమికోన్నత పాఠశాలలు 03(విద్యార్థుల సంఖ్య-99), ఉన్నత పాఠశాలలు 6(విద్యార్థుల సంఖ్య 1662) ఉన్నారు. అలాగే ప్రభుత్వ బాలుర, బాలిక జూనియర్ కళాశాల్లో(ప్రథమ సంవత్సరం విద్యార్థుల సంఖ్య-210, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల సంఖ్య 186) విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాడు-నేడులో భాగంగా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, బాలురకు, బాలికలకు వేర్వేరుగా, తాగునీరు ఏర్పాటు, పాఠశాలల్లో చేయదగిన మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, గ్రీన్ చాక్ బోర్డు ఏర్పాటు, స్మార్ట్ టీవీ, విద్యార్థులకు ఫర్నిచర్ (డెస్కులు, పుస్తకాలు పెట్టుకునేందుకు ర్యాక్‌లు), పాఠశాలకు సుందరమైన పెయింటింగు, కాంపౌండు వాల్స్ నిర్మాణం, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా సుందరమైన గార్డెన్‌ను ఏర్పాటు చేశారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ..



నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్నాయి. పరిశుభ్రమైన పరిసరాలతో పాటు, అన్ని మౌలిక వసతులు పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. రుచికరమైన, పౌష్టికాహారం అందించే జగనన్న గోరు ముద్ద కార్యక్రమంతోపాటు, నాణ్యమైన విద్య, అంతకు మించి విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన విద్యను అందిస్తున్నారు. సులభతరంగా విద్యను అభ్యసించేందుకు 72 ఇంచెస్ ఎల్ఈడీ టీవీని కూడా పాఠశాలలో ఏర్పాటు చేశారు.

-కోకిల, విద్యార్థి తల్లి, మణిపిరెడ్డిపల్లి

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడంతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలికింది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి సౌకర్యాలు లేవు, ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టి, పాఠశాల అభివృద్ధికి సుమారు రూ.58 లక్షలు కేటాయించింది. అన్ని వసతులతోపాటు గార్డెన్ కూడా ఏర్పాటు చేశారు. పక్క మండలాలైన పెనుమూరు, పూతలపట్టు నుంచి 60 మంది విద్యార్థులు అచ్చమ్మ అగ్రహారం ఎంపీపీ పాఠశాలలో చదువుతున్నారు.

-అనగళ్లు జార్జ్, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం, అచ్చమ్మఅగ్రహారం

మా అదృష్టం....



ప్రభుత్వం నాడు-నేడు లాంటి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టి పాఠశాలలను అభివృద్ధి చేయడం మా అదృష్టంగా భావిస్తాం. మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలంటే తలకు మించిన భారమైన పని. మా పిల్లలకు మంచి చదువును అందించి ఉన్నత స్థాయికి చేర్చాలన్నది మా ఆశయం. మా కలను సాకారం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇలాంటి మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టి మా బాధ్యతలను ప్రభుత్వం నెరవేరుస్తోంది. నాకు ముగ్గురు పిల్లలు, ముగ్గురూ కూడా ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించారు. ప్రస్తుతం మూడో కూమార్తె తేజశ్వి ఇదే పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది.

- శ్రీదేవి, ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్, అచ్చమ్మఅగ్రహారం

రాబోయే తరాలకు స్ఫూర్తి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన నాడు-నేడు పథకం రాబోయే తరాల వారికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తోంది. అంతే కాకుండా పిల్లలను చదివించలేకపోతున్నామన్న మాటలకు తావు లేకుండా ప్రభుత్వం పాఠశాలలకు మెరుగులు దిద్దింది. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలకు అందించాలనుకున్న నాణ్యమైన విద్య మన ఊర్లోనే దొరుకుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. ఈ ప్రభుత్వం విద్యాశాఖకు పెద్ద పీట వేసి, విద్యార్థుల భవిష్యత్తుగా అండగా నిలవడం నిజంగా అభినందించదగ్గ విషయం.

-బాబ్జీ, పాకాల మండల విద్యాశాఖాధికారి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించింది. తిరుపతి అక్షర వేదసి నృత్య ప్రదర్శన క్షేత్రం ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరతనాట్యం ఆకట్టుకుంది. ఇందులో భాగంగా వివిధ పాటలకు కళాకారులు ఈషాని, చంద్రస్నిగ్ధ, గాయత్రి, సారా జోషిత, మానస, నిత్యప్రగతి, లాస్య, శాన్వి, ప్రియ, జిత్య, ప్రత్యూష, తేజస్వి, హాస్య, ధన్విక, రివిక, మహితల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాటకు తగ్గ అభినయం, హావభావాలతో కళాకారులు చూడచక్కని నృత్యం ప్రదర్శించారు. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.